సాక్షి
సూర్యాపేట
సోమవారం । 27 । మార్చి । 2023



### ఉపవాసంతో ఆత్మప్రక్షాళన

రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టడం ఆత్మప్రక్షాళన చేసుకోవడంతో సమానమని ముస్లింలు భావిస్తారు. - 10లో



### యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. - 10లో

గరిష్టం/కనిష్టం
37°/25°

### వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

### రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-35
(సోమవారం సాయంత్రం)
సహర్ 4-51
(మంగళవారం ఉదయం)

# పత్తి విత్తన ధర పెంపు

**570 గ్రాముల ప్యాకెట్‌పై రూ.43 పెంచిన కేంద్రం**

- రూ.810 నుంచి రూ.853కు చేరిన ధర
- జిల్లా రైతులపై పడనున్న అదనపు భారం రూ.93.67లక్షలు



| | |
|---|---|
| గతేడాది పత్తిసాగు విస్తీర్ణం | 1,08,930 ఎకరాలు |
| అవసరమైన విత్తన బ్యాగ్‌లు | 2,17,860 |
| ఈ ఏడాది ప్యాకెట్‌పై పెరిగిన ధర | రూ.43 |
| రైతులపై పడనున్న భారం | రూ.93,67,980 |

నాగారం: కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తన ప్యాకెట్ ధరను రూ.853గా నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. గత ఏడాదితో పోలిస్తే వివిధ కంపెనీలకు చెందిన ప్యాకెట్లపై ఈ సారి అదనంగా రూ.43 ధర పెంచింది. గతంతో పోలిస్తే విత్తనాల ధర, కూలిరేట్లు అధికమై పెట్టుబడి పెరగనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పత్తి రైతులకు కష్టమే..**

పత్తి సాగు చేసే రైతులు ఎకరాకు 570 గ్రాముల ప్యాకెట్లు రెండు చొప్పున ఉపయోగిస్తారు. ఈ లెక్కన గతేడాది జిల్లా సాగు విస్తీర్ణం 1.08లక్షల ఎకరాలు ఉండగా ఆ మేరకు 2.17లక్షల విత్తన సంచులు అవసరం ఉంటుంది. వందల రకాల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం బీటీ–2 పత్తి విత్తనాల సంచి ధర రూ.810గా ఉంది. వచ్చే సీజన్‌లో ఒక సంచి రూ.853లకు విక్రయించుకోవచ్చని కేంద్రం ప్రకటించింది. ఈ ప్రకారం గతేడాది సాగైన విస్తీర్ణానికి అవసరమైన సంచులపై అదనంగా రూ.93.67 లక్షల భారం పడనుండడంతో ఇంకా ఎరువులు, ఇతర మందుల ధరలు ఎంత పెంచుతారోనని పత్తి రైతులు మదనపడుతున్నారు.

**ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు**

పత్తి విత్తనాలు రైతులకు ఎక్కువ మొత్తంలో అవసరం ఉండడంతో ఏటా నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు. మేలు రకాల విత్తనాలను ధ్రువీకరించిన డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని అధికారులు అంటున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వచ్చే సీజన్ నుంచి ప్రతి విత్తన సంచిపై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ కోడ్‌లో ఏ కంపెనీ, ఎప్పుడు తయారు చేసింది. లాట్ నంబర్, విత్తనరకం తదితర వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కొన్ని కంపెనీలు విక్రయించిన విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

**ధర నిర్ణయం కేంద్రానిదే..**

పత్తి పంటను సాగు చేసే రైతులు విత్తనాలను ప్రైవేట్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్‌లో ప్రవేశపెట్టడంతో విత్తన ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ తదితర ఖర్చులను లెక్కించి ప్రభుత్వం ధరను నిర్ణయిస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకే కంపెనీలు విత్తనాలను విక్రయించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో బీటీ–1, బీటీ–2 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నా..అధిక మొత్తంలో రైతులు బీటీ–2 విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తారు.



నల్లగొండలో జరిగిన పంచాయతీ పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు

# అవార్డుల వెనుక సర్పంచ్‌ల శ్రమ

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాల అందజేత

నల్లగొండ: ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాల వెనుక సర్పంచ్‌ల శ్రమ దాగి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నల్లగొండలోని గుండగోని మైసయ్య ఫంక్షన్ హాల్లో పంచాయతీలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అవార్డులు సాధించిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంత్రి జగదీశ్‌రెడ్డి.. ఆయా జిల్లాల జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలతో కలిసి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ దఫా గెలిచిన సర్పంచ్‌లు ఎంతో అదృష్టవంతులని పేర్కొన్నారు. వారు గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 81 గ్రామ పంచాయతీలు పురస్కారం దక్కించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, అంతర్గత రహదారుల నిర్మాణాలు అభివృద్ధికి నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపు, గొప్ప ఆలోచనా విధానం వల్ల తెలంగాణలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. పర్యావరణంలో దేశంలోనే తెలంగాణ 5వ స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరం దేశ వ్యాప్తంగా వచ్చిన అవార్డుల్లో తెలంగాణకే ఎక్కువగా వచ్చాయని, దానికి గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధుల కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపికయుగేందర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్ నాయక్, ఎన్.భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు వినయ్‌కృష్ణారెడ్డి, వెంకట్‌రావ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, పాటిల్ హేమంత్ కేశవ్, దీపక్‌తివారీ పాల్గొన్నారు.



మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక చేతుల మీదుగా అవార్డులు స్వీకరిస్తున్న సిరిపురం సర్పంచ్ లక్ష్మీవీణ, పంచాయతీ కార్యదర్శి సతీష్

ఉత్తమ గ్రామ పంచాయతీలకు పురస్కారాలు | 8లో

### న్యూస్‌రీల్

### మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. ఆ తర్వాత స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవాన్ని చేపట్టి వేదమంత్రోచ్చరణాలతో కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోట గోపి

నేరేడుచర్ల: మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో నిర్వహించిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఏప్రిల్‌లో రాజ్యాంగ పరిరక్షణకు గ్రామగ్రామాన యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, నాయకులు కోదాటి సైదులు, వెంకటేశ్వర్లు, ఏసు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 90మందికి వైద్య పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. సామాజిక స్పృహలో భాగంగా ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వెంకటయ్య, యాకయ్య, వీరారెడ్డి, పాపిరెడ్డి, రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఓపెన్ యూనివర్సిటీ సేవలు ఎనలేనివి

దేవరకొండ: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) సేవలు ఎనలేనివని విశ్వవిద్యాలయం జాయింట్ డైరెక్టర్, తెలుగు రాష్ట్రాల నోడల్ అధికారి డాక్టర్ బానోతు ధర్మానాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాక్ ఫర్ టీమ్ విజిట్‌లో భాగంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ కౌన్సిలర్లు, అంబేద్కర్ దూర విద్యా కేంద్రం జాక్టో ఎస్.పుల్లయ్య పాల్గొన్నారు.

# రేషన్ కోటాలో కోత

- ఉచిత బియ్యం పంపిణీలో కోత విధించిన ప్రభుత్వాలు
- గతేడాది డిసెంబర్ వరకు పది కిలోల చొప్పున అందజేత
- ప్రస్తుతం యూనిట్‌కు ఐదు కిలోలే..
- పూర్తి స్థాయిలో అందించాలని లబ్ధిదారుల వేడుకోలు



| | |
|---|---|
| రేషన్ షాపులు 610 | కార్డులు 3,24,432 |
| లబ్ధిదారులు 9,33,775 | ఎన్‌ఎఫ్‌సీ కార్డులు 1,43,697 |
| యూనిట్లు 5,01,733 | ఎస్‌ఎఫ్‌సీ కార్డులు 1,80,739 |
| యూనిట్లు 4,32,042 | |

దురాజ్‌పల్లి(సూర్యాపేట): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంలో కోతపడింది. జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు మూడు నెలలుగా పూర్తిస్థాయిలో రేషన్ అందడం లేదు. కేంద్రం నుంచి విడుదలవుతున్న 5 కిలోల బియ్యాన్నే పంపిణీ చేస్తున్నారు. ఫలితంగా రేషన్ బియ్యంపైనే ఆధారపడుతున్న పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

**యూనిట్‌కు 5 కేజీలే..**

లబ్ధిదారులకు కరోనాకు ముందు కార్డులో ఉన్న ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున బియ్యం అందించేవారు. ఇందుకు కిలోకు రూ.1 చొప్పున వసూలు చేసేవారు. కరోనా అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) ద్వారా ఉచిత బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తెల్లరేషన్ కార్డులో పేరున్న ఒక్కొక్కరికీ 10 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. నాటినుంచి ఈ రాయితీని పొడిగిస్తూ 2022 డిసెంబర్ నెల వరకు ఉచిత బియ్యం అందించారు. ఆ తరువాత ఉచిత రేషన్ పంపిణీపై సందిగ్ధత ఏర్పడింది. దీంతో 2023 డిసెంబర్ నెల వరకు రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కు 5 కిలోలు ఉచితంగా అందజేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా కలుపుకొని లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

**మూడు నెలల నుంచి..**

కేంద్ర కోటాతోపాటు రాష్ట్రం వాటా కలుపుకొని లబ్ధిదారులుకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నా.. జిల్లాలో మూడు నెలలుగా కేవలం 5 కిలోల బియ్యాన్నే కార్డుదారులకు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాలో కోత విధించడంతోనే ఈ పరిస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు. అయితే సాధారణంగా యూనిట్‌కు 6 కిలోలు అందించాలి కానీ.. రాష్ట్రం తన వాటా అందించకపోగా యూనిట్‌కు కిలో కోత విధించింది. కాగా పూర్తి స్థాయిలో రేషన్ అందక లబ్ధిదారులు వచ్చిన వాటితోనే సరిపెట్టుకున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర కోటాతో కలుపుకొని యూనిట్‌కు పది కిలోలు అందించాలని పేదలు కోరుతున్నారు.

### యాదాద్రీశుడికి శాస్త్రోక్త పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు వేకువజామున సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం , నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### ఉద్యమకారులకు అన్యాయం చేసిన కేసీఆర్



రాయినిగూడెంలో తెలంగాణ ఉద్యమకారుడిని పరామర్శిస్తున్న బీఎస్పీ నేతలు

గరిడేపల్లి: మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ అన్యాయం చేశారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్ యాదవ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రాపోలు నవీన్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం గరిడేపల్లి మండలం రాయినిపాలెం గ్రామంలో తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్యాయత్నం చేసి రెండు కాళ్లు, చేయి కోల్పోయిన పిడమర్తి నాగరాజును వారు పరామర్శించారు. నాగరాజుకు అండగా ఉంటామని చెప్పిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు 9 ఏళ్లు గడుస్తున్నా నేటికీ న్యాయం చేయలేదన్నారు. ఆయన వెంట బీఎస్పీ మండల అధ్యక్షుడు అమరవరపు వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపంగ ఉపేందర్, నియోజకవర్గ అధ్యక్షులు జిలకర రామస్వామి, తక్కెళ్ల నాగార్జున, గొల్కొండ విజయ్‌కుమార్, రావుల స్వరూప్‌రావు తదితరులున్నారు.

# దేశంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజ్జు కృష్ణన్

నేరేడుచర్ల: బీజేపీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు దేశంలో 4లక్షల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజ్జు కృష్ణన్ ఆరోపించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర నేరేడుచర్లకు చేరుకున్న సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు నల్లా చట్టాలను తీసుకరావడంతో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 380 రోజుల పాటు ఉద్యమించడంతో కేంద్రం దిగివచ్చిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. మతోన్మాద బీజేపీకి దేశంలో చోటు లేకుండా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో నరేంద్రమోదీ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి పార్లమెంటులో ఆమోదించడం లేదన్నారు.



సభలో మాట్లాడుతున్న విజ్జు కృష్ణన్, చిత్రంలో జూలకంటి, సుదర్శన్ తదితరులు

**బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు తెలియజేసేందుకే జన చైతన్య యాత్రలు : జూలకంటి**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు జన చైతన్య యాత్రలను చేపట్టామని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. 135 కోట్ల ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించే మోదీ అన్నివర్గాల ప్రజలకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 550 రైతు సంఘాలు, 5లక్షల మంది రైతులతో ఏప్రిల్ 5న ఢిల్లీలో భారీ ధర్నాను నిర్వహించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.నగేష్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, నాయకులు తిరుపతయ్య, రామ్మూర్తి, శ్రీనివాస్ రావు, మీనయ్య, సైదులు, ఆఫీజ్ పాల్గొన్నారు.

# దేశంలో బీజేపీ పతనం ఖాయం

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజల చేతిలో పతనమవుతుందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామం నుంచి మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో చేపట్టే హాత్‌సే – హాత్ జోడో యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అన్నారు. 2024లో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీపీ పుట్టల సునీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాడ్గులపల్లి జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీప్రవీణ్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, రేగటి రవీందర్, పల్లా వీరయ్య, పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



జోడో యాత్రలో పాల్గొన్న ఎంపీ ఉత్తమ్

### ధర్మభిక్షానికి నివాళి



మాజీ ఎంపీ, దివంగత నేత బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా ఆదివారం సూర్యాపేటలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

# బడి సమాచారం పక్కాగా..

- యూడైస్ ప్లస్‌లో వివరాల నమోదు
- క్షేత్రస్థాయిలో తప్పిదాలను పరిశీలిస్తున్న అధికారులు
- నివేదిక ఆధారంగా కేంద్రం నుంచి మంజూరు కానున్న నిధులు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,271 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు



యూడైస్ ప్లస్‌లో వివరాలను పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేట టౌన్: జిల్లాలో ఇకనుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమాచారం పక్కాగా లభించనుంది. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పాఠశాలల స్థితిగతులు, వాస్తవ పరిస్థితులు, విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇందులో నమోదైన వివరాలను జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి కేంద్రానికి నివేదికలు పంపిస్తే, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరవుతాయి.

**మొత్తం పాఠశాలలు 1,271**

జిల్లాలో 1,271 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కేజీబీవీలు 18, మినీ గురుకులాలు ఒకటి, మైనార్టీ వెల్ఫేర్ స్కూళ్లు నాలుగు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు 8, మండల, జిల్లా పరిషత్ స్కూళ్లు 909, ప్రైవేట్ ఎయిడెడ్ 19, ప్రైవేట్ 242, ప్రైవేట్ సీబీఎస్‌ఈ సిలబస్ స్కూళ్లు 2, ప్రభుత్వ హైస్కూళ్లు 41, మోడల్ స్కూళ్లు 9, ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఆయా సొసైటీ స్కూళ్లు 16 ఉన్నాయి. ఆయా స్కూళ్లలో 1,39,184 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

**పరిశీలన చేస్తున్నాం**

తప్పిదాలు జరగకుండా ఉండేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం. వివరాలు సరిగా ఉన్న పాఠశాల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తాం. యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రకారమే మౌలిక సదుపాయాలు, స్కూల్ గ్రాంట్స్ మంజూరవుతాయి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

**క్షేత్రస్థాయిలో పరిశీలన..**

ఈ నెల 30వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతోంది. పాఠశాలల హెచ్ఎంలు నమోదు చేసిన వివరాలు కాంప్లెక్స్ స్కూల్‌కు, ఎంఈఓ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి లాగిన్‌కు చేరతాయి. నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు జిల్లా అధికారులను నియమించారు. వీరు ఎప్పటికప్పుడు యూడైస్ ప్లస్‌లో పాఠశాలల వివరాలు నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

**30వ తేదీ వరకు నమోదు**

ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా కలెక్టరేట్‌లో ఎర్రర్ వ్యాలిడేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ వర్క్ షాపులో ఆయా పాఠశాలల, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు. పాఠశాల పేరు, తరగతుల సంఖ్య, తరగతి గదుల సంఖ్య, ప్రతీ తరగతిలోని విద్యార్థుల సంఖ్య, వారి నేపథ్యం, బడిలో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాటిలో నీటి వసతి, పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు, సంక్రమణ వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నారా, హ్యాండ్ వాష్ ఏర్పాట్లు, తరగతి గదుల దుస్థితి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యార్థుల ఉత్తీర్ణతశాతం, పాఠ్య ప్రణాళిక కార్యక్రమాలు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థుల వివరాలు, క్రీడా ఉపాధ్యాయులు, స్కావెంజర్లు తదితర వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

## క్లుప్తంగా

### భార్య కాపురానికి రావడం లేదని..

- ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**తిరుమలగిరి:** భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిరుమలగిరి మండల పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని రాఘవపురం గ్రామానికి చెందిన భూక్యా పంతులు(27) తొండ గ్రామంలో ఓ రైతు మామిడితోటలో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఇతడి భార్య గొడవల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా రాజీ కుదరలేదు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన పంతులు శనివారం సాయంత్రం మామిడి తోటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానిక రైతులు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

**మిర్యాలగూడ :** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. దామరచర్ల, కోదాడ, సూర్యాపేట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు(47) మరో వ్యక్తి సుదాయితో కలిసి వాడపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన బంధువును పరామర్శించేందుకు బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్థానిక సిమెంట్ పరిశ్రమలోకి వెళ్లేందుకు రోడ్డుపై లారీ యూటర్న్ తీసుకుంటుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లి వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి సుదాయికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.పోస్టుమార్టం నిమిత్తం పిల్లి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు కోటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

**ఆర్టీసీ బస్సు ఢీకొని..**

**కోదాడరూరల్ :** కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన నాగర్జునపు పాండురంగాచారి(55) స్కూటీపై ఆదివారం నయానగర్ రంగాథియేటర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ ఇన్‌గేట్ ఎదురుగా ఏపీలోని ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన అతనిపై నుంచి బస్సు వెళ్లడంతో తలఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె నాగసాయి ఫిర్యాదు మేరకు సీఐ శివశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**కారు ఢీకొని..**

**సూర్యాపేటక్రైం :** పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన శ్రీరాముల భరత్, కుంచం మహేందర్‌లు బైక్‌పై సూర్యాపేటకు వస్తున్నారు. మార్గమధ్యలో పట్టణంలోని జమ్మిగడ్డ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ (19) అక్కడికక్కడే మృతి చెందగా మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భరత్ మృతితో సింగారెడ్డిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి శ్రీరాముల క్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

# బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పథకాలు శూన్యం
- మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



తిప్పర్తి : మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



ధర్మభిక్షం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, సీపీఐ నాయకులు

**రామగిరి(నల్లగొండ):** బీఆర్ఎస్ గెలుపుతోనే నల్లగొండలో అభివృద్ధి ప్రారంభమైందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం తిప్పర్తిలో మార్కెట్ యార్డులో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో నల్లగొండలో అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభివృద్ధిని గాలికి వదిలేశాడని విమర్శించారు. భూపాల్‌రెడ్డి గెలిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో నల్లగొండకు మెడికల్ కాలేజీ, హైదరాబాద్ తరహాలో ఐటీ హబ్ తీసుకొచ్చారని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ సొంత రాష్ట్రంలో కేవలం 6గంటలు మాత్రమే కరెంటు అందుతుందని, తెలంగాణలో 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత కరెంటు అందిస్తున్నామని గుర్తుచేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం లేదని కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రానికి రావాల్సిన రూ. 35 వేల కోట్ల నిధులు కేంద్ర ఇవ్వడం లేదన్నారు. గ్రామ స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొంది మూడో సారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు తిప్పర్తి సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కాసోజు శంకరమ్మ, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, వనపర్తి నాగేశ్వరరావు, ఏనుగు వెంకట్‌రెడ్డి, పాశం సంపత్‌రెడ్డి, చీర పంకజ్‌యాదవ్, ముత్తినేని శ్యామ్‌సుందర్, కందుల లక్ష్మయ్యరేణుక, కటింక సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మభిక్షం జీవితం ప్రజాసేవకు అంకితం**

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** ఎంపీగా, సూర్యాపేట ప్రథమ శాసనసభ్యుడిగా పనిచేసిన బొమ్మగాని ధర్మభిక్షం జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కొనియాడారు. బొమ్మగాని ధర్మభిక్షం 12వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గల ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ధర్మభిక్షం పేదల మనిషి అని, అరవై ఏళ్ల క్రితమే సూర్యాపేట ప్రాంతంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి పాఠశాలలు, వసతి గృహములు ఏర్పాటు చేసి, ఈ ప్రాంతంలో విద్యా వికాసానికి కృషి చేశారని పేర్కొన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం సంఘాలు నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, జిల్లా గ్రంథాల చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పేరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్, మొరగుండ్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్.. తెలంగాణకు శ్రీరామరక్ష

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కవితపై లిక్కర్ కేసు
- మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

**మిర్యాలగూడ:** సీఎం కేసీఆర్.. తెలంగాణకు శ్రీరామరక్ష అని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. శనివారం వేములపల్లి మండలం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏండ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి తెలంగాణాను అభివృద్ధి పథంలో కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో రూ.1లక్ష అందిస్తున్నామని, గర్భిణీలకు కేసీఆర్ కిట్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 45లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, ప్రకృతివనం, శ్మశానవాటికలను ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే తెలంగాణ ఆడబిడ్డ కవితపై లిక్కర్ కేసు బనాయించారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ లాంటి సంస్థలను గుప్పిట్లో పెట్టుకోని ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులను పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల సంపదను మోదీ కేవలం 22 మంది పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతూ రూ.12లక్షల కోట్ల రుణమాఫీ చేశారన్నారు. అందులో 20 మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారేనన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మిర్యాలగూడలో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేములపల్లి జడ్పీటీసీ ఇరుగుదిండ్ల పద్మవెంకటయ్య, పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**గరిడేపల్లి :** గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఎల్‌బీనగర్‌లో చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలం ఎల్‌బీనగర్‌కు చెందిన దొంతిరెడ్డి నరేందర్‌రెడ్డి తండ్రి ఆరోగ్య రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం ఎల్‌బీనగర్‌లోని ఇంటి వద్దకు రాగా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో గల ఆభరణాలు కనిపించలేదు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి క్లూజ్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వడగండ్ల వర్షం.. అపార నష్టం



ఆరెగూడెంలో రాలిన మామిడి కాయలు



సూరారంలో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

**సాక్షి నెట్‌వర్క్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. భారీ ఈదురుగాలలకు పలు చోట్ల చెట్లు విరగడంతో పాటు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. కొన్ని చేతికొచ్చిన పంటచేలు నేలవాలాయి. ఆలేరు మండల పరిధి మంతపురి గ్రామంలో ఈదురుగాలులకు పల్లా నర్సింహారెడ్డి రేకుల కొట్ట కూలిపోయింది. రేకులు తగలడంతో బిట్కూరి వినోద్‌కు గాయాలయ్యాయి. మోత్కూర్ పట్టంలోని గడీబజారులో మల్లెబోయిన బుచ్చయ్యకు చెందిన సిమెంట్ రేకుల ఇంటిపై చెట్టు కూలడంతో ధ్వంసమైంది. ఆ సమయంలో బుచ్చయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. కాశవారిగూడెం వద్ద కరెంట్ స్తంభం విరిగిపోయింది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం గ్రామ పరిధిలో రాళ్ల వర్షం కురిసింది. వర్షానికి కొన్ని చోట్ల వరిచేనులు నెలకొరిగాయి. రామన్నపేట మండలం సూరారం గ్రామంలో ఎనిమిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. బలమైన గాలులకు ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. రేకులు లేచిపోయిన ఇండ్లలోని నిత్యావసర సరుకులు సామగ్రి తడిసి పోయాయి. చెట్లు కూలిపడడంతో ఇండ్లు, వాహనాలు ధ్వంస మయ్యాయి. ఈదరుగాలులకు లక్ష్మాపురం, దుబ్బాక గ్రామాల్లోనూ విద్యుత్‌స్తంబాలు నేలకొరిగా యి. మోటకొండూర్ మండలం గిరిబోయినగూడెం, ఆరేగూడెం, మేడికుంటపల్లి, రాయికుంటపల్లి మరియు పలుగ్రామాల్లో మామిడి చెట్ల కాయలు రాలిపోయాయి. గుండాల మండల కేంద్రానికి చెందిన ఇంద్రకంటి యాదయ్య ఇంటి పైకప్పు లేచిపోయింది. వర్షానికి ఇంట్లో ఉన్న సామగ్రి తడిసి ముద్దయ్యాయి.

## ‘మన ఊరు-మన చరిత్ర’ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జూలూరి గౌరీ శంకర్

**చిలుకూరు:** మన ఊరు– మన చరిత్రను నేటి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మన ఊరు – మన చరిత్రలో భాగంగా చిలుకూరు గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామాలకు సంబంధించిన మన ఊరు– మన చరిత్ర పుస్తకాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ గ్రామాలకు చెందిన డిగ్రీ విద్యార్థులచే పుస్తకాలు రాయిస్తున్నట్లు తెలిపారు. పలు దేశాల చరిత్రలు, ప్రముఖ నాయకుల చరిత్రలు పుస్తకాల్లో రూపొందిచినప్పుడు మనం పుట్టిన ఊరు చరిత్రను కూడా మనం తెలుసుకోవాలని అన్నారు. పర్యటనలో భాగంగా చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం భవనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాత చిలుకూరులో రామాలయం, చెన్నకేశవ ఆలయాన్ని ఆయన పరిశీలించి దేవాలయాల చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ గ్రామాన్ని పూర్తిగా పరిశీలించి, అన్ని కోణాల్లో ఊరి చరిత్ర పుస్తకాలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమానికి ముందు స్వాంతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు ఇంటికి వెళ్లి అయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరీ, ఎస్ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ కొడారు బాబు, దొడ్డా సురేష్‌బాబు, కస్తూరి నర్సయ్య పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక జ్ఞానం.. జీవితానికి మార్గం



మాట్లాడుతున్న తుకారాం

**భూదాన్‌పోచంపల్లి :** ఆధ్యాత్మిక జ్ఞానం అవరోధాలను అధిగమించి చక్కటి జీవితానికి మార్గాన్ని చూపిస్తుందని సంగీత, సాహిత్య భాగవత వేదాంత గురుపరంపర అద్వైత్వ ప్రచారకులు(గుంటూరు) తుకారాం అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కేండేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో ఆత్మజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానమనేది కులం, దేశం, ప్రాంతానికి పరిమితం కాదని, అది సమస్త మానవులకు సంబంధించిందని అన్నారు. ఏ వృత్తిలో ఉన్న, చేసే సేవకు ఆధ్యాత్మికం తోడైతే ఆ సేవ నిస్వార్థం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు కడవేరు చంద్రయ్య, కటకం తుకారాం, భారత పురుషోత్తం, సీత రాములు, నోముల అశోక్, సీత సత్యనారాయణ, చక్రాల నర్సింహ, కడవేరు ఎల్లప్ప, సూరెపల్లి యాదగిరి, జల్ది నర్సింహ, గంజి బాలయ, భోగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీలకు పురస్కారాలు



మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చీదెళ్ల సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, కార్యదర్శి సంజయ్



అనంతారం సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజేష్



రామన్నగూడెం సర్పంచ్,రమావత్ పీరమ్మ, కార్యదర్శి ఉపేందర్‌రావు



జి.తిరుమలగిరి సర్పంచ్ నిర్మల, కార్యదర్శి నూకల కోటిరెడ్డి



గోరెంట్ల, సర్పంచ్ వెంకన్న, కార్యదర్శి మంగ



చింతల్‌కుంట తండా సర్పంచ్ జాటోత్ రవి, కార్యదర్శి సురేష్



సోలిపేట్, సర్పంచ్ శోభారాణి, కార్యదర్శి చంద్రశేఖర్



ఫణిగిరి సర్పంచ్ నర్సింహారావు, కార్యదర్శి జిందగిరి



మిర్యాల సర్పంచ్ సునీత, కార్యదర్శి ఏసమళ్ల అనిల్



గానుగుబండ సర్పంచ్ రామ చంద్రారెడ్డి, కార్యదర్శి కృష్ణ



పాత్రలపాడ్, సర్పంచ్ మల్లయ్య, కార్యదర్శి షమ్మి



ఏపూరు సర్పంచ్ సానబోయిన రజిత, కార్యదర్శి ఉమ



కోదండరామాపురం సర్పంచ్ రమేష్, కార్యదర్శి కవిత



త్రిపురవరం సర్పంచ్ వీరమ్మ, కార్యదర్శి అహ్మదాబేగం



దిర్శించర్ల సర్పంచ్ నాగంటి మాధవి, కార్యదర్శి రమాదేవి



రెడ్లకుంట సర్పంచ్ సాధినేని లీల, కార్యదర్శి నాగలక్ష్మి



తుమ్మలపల్లి సర్పంచ్ రమేశ్, కార్యదర్శి సతీష్



మేళ్లచెర్వు సర్పంచ్ శంకర్ రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి



దొండపాడు సర్పంచ్ పద్మావతి, కార్యదర్శి రామానాయక్



అమరవరం సర్పంచ్ గుజ్జుల సుజాత, పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు



మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



కీతవారిగూడెం సర్పంచ్ కీత జ్యోతిరామారావు, కార్యదర్శి ధనమూర్తిగౌడ్



యల్లాపురం సర్పంచ్ తీగల లక్ష్మమ్మ, కార్యదర్శి వినయ్



రామాపురం : సర్పంచ్ మీసాల గంగ, కార్యదర్శి ఎండీ అజమదుల్లా